క్లుప్తంగా

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

కాచిగూడ: హిందూ శ్మశానవాటిక ప్రబంధక సమితి ఆధ్వర్యంలో నింబోలిఅడ్డలోని ప్రసన్నాంజనేయ స్వామి సేవా హెల్త్ క్లినిక్‌లో ఆదివారం ఉదయం 9 గంటలకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హరాస్‌పెంట హిందూ శ్మశానవాటిక ప్రబంధక సమితి అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రావు ప్రకటించారు. లోకాయుక్త జస్టిస్ సీవీ రాములు ముఖ్య అతిథిగా పాల్గొని హెల్త్ క్యాంపును ప్రారంభిస్తారన్నారు. ఈ ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా..


సూర్యనారాయణశర్మ

ముషీరాబాద్: బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా సూర్యనారాయణశర్మ నియమితులయ్యారు. ప్రతి నియోజకవర్గం నుంచి ఒక స్టేట్ కౌన్సిల్ మెంబర్‌కు అవకాశం కల్పించగా.. ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి సూర్యనారాయణ శర్మకు అవకాశం కల్పించారు. శర్మ ఏబీవీపీ, విద్యార్థి సంఘంతో పాటు బీజేవైఎం, బీజేపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా నియమించినందుకు రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కిషన్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

అభినందన

కాచిగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చే వరకు పార్టీ నేతలు, కార్యకర్తలు శ్రమించాలని బీజేపీ ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్ పూర్ ఎమ్మెల్యే రాజీవ్ గుంబర్ పిలుపునిచ్చారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి ఆధ్వర్యంలో శనివారం కాచిగూడలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయనను గీతామూర్తి ఘనంగా సత్కరించి అభినందించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను గడపగడకూ.. ప్రచారం చేసి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలని కోరారు.

నిత్య జనగణమన అభినందనీయం


జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రాజీవ్ గుంబేర్

నల్లకుంట: గత ఏడాదిన్నర కాలంగా నిత్య జనగణమన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని బీజేపీ అంబర్‌పేట నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు రాజీవ్‌గుంబేర్ అన్నారు. నిత్య జనగణమన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్య జనగణమన కార్యక్రమం 476వ రోజుకు చేరింది. శనివారం నల్లకుంట శివానంద్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన రాజీవ్ గుంబేర్, స్థానిక కార్పొరేటర్ వై. అమృతతో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. నేలంటి మధు, క్రాంతి, జూలంటి ప్రశాంత్, శ్రీనివాస్, బీజేపీ నాయకులు అచ్చిని రమేష్, మధుయాదవ్, ధర్మేందర్, యాదగిరి, రాఘవేందర్, ప్రసాద్ దూబే, ప్రేమ్‌రాజ్ తదితరులున్నారు.

పెండింగ్ సమస్యలకు సత్వర పరిష్కారం

ముషీరాబాద్: ఫ్రెండ్స్ కాలనీలో నెలకొన్న సమస్యలను సత్వరం పరిష్కరిస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. శనివారం ముషీరాబాద్ డివిజన్‌లోని ఫ్రెండ్స్ కాలనీలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పూసగోరక్‌నాథ్‌తో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. మాట్లాడుతూ.. ఫ్రెండ్స్ కాలనీ పార్కును అభివృద్ధి చేస్తామని, పార్కు చుట్టూ ప్యాచ్‌వర్క్స్ పూర్తి చేస్తామన్నారు. ఫ్రెండ్స్ కాలనీ అధ్యక్షుడు శంకర్, ఉపాధ్యక్షులు గంగారాం, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, శివముదిరాజ్, నర్సింగ్‌ప్రసాద్, అరుణ్‌కుమార్ తదితరులున్నారు.

ఉద్యమకారులకే టికెట్ కేటాయించాలి

ముషీరాబాద్: రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకే ముషీరాబాద్ బీఆర్ఎస్ టికెట్ కేటాయించాలని బీఆర్ఎస్ గ్రేటర్ మాజీ ఉపాధ్యక్షుడు శ్రీశైలంయాదవ్ డిమాండ్ చేశారు. శనివారం ముషీరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. అందరినీ కలుపుకుని పోయే నాయకులకే టికెట్టు కేటాయించాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వల్లే బీఆర్ఎస్ అభ్యర్థులందరూ ఓడిపోయారని ఆరోపించారు. నియోజకవర్గంలో అధిక శాతం ఉన్న ముస్లిం, మైనార్టీలకు ఒక డివిజన్ అధ్యక్ష పదవి కూడా కేటాయించలేదన్నారు. ఇలాంటి నిర్ణయాలతో పార్టీ నష్టం వచ్చే అవకాశం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి ఎంపికకై సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌లను కలుస్తామన్నారు. ముషీరాబాద్ నుంచి గన్‌పార్కు వద్ద గల తెలంగాణ అమర వీరుల స్థూపం వరకు తెలంగాణ ఉద్యమకారులతో ర్యాలీ నిర్వహించి తమ డిమండ్లను పార్టీ అధిష్టానానికి వెల్లడిస్తామన్నారు.

సమగ్రాభివృద్ధికి కృషి

- సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు
- హరితహారంలో భాగంగా మొక్కలు నాటిన ఎమ్మెల్యేలు

అంబర్‌పేట: నియోజకవర్గంలో రోడ్ల సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు సీసీరోడ్లు వేస్తున్నామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం గోల్నాక డివిజన్ కిశోర్‌కుంజ్ గల్లీలో రూ.24 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్లు శాశ్వతంగా ఉండేలా సీసీరోడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అంబర్‌పేట డివిజన్‌లో..

- అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులను స్థానిక కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం పాదయాత్ర చేసి స్థానికుల నుంచి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.
- నియోజకవర్గంలో పచ్చదనం పెంపొందించేందుకు గత నాలుగేళ్లుగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం అంబర్‌పేట డివిజన్‌లో హరితహారంలో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి ఆయన మొక్కలు నాటారు. నియోజకవర్గంలో దాదాపు అన్ని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటామని, మరిన్ని ఖాళీ స్థలాలను గుర్తించి ఈ వర్షాకాలం ముగిసేలోపు మొక్కలు నాటేందుకు కృషి చేస్తామన్నారు. జీహెచ్ఎంసీ హార్టికల్చర్ అధికారులు, సిబ్బంది, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పార్కుల సుందరీకరణకు కృషి..

ముషీరాబాద్: నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ పార్కుల సుందరీకరణకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. శనివారం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలో గల పార్కులను ఆహ్లాదకరంగా రూపుదిద్దుతున్నామని, ఉదయం, సాయంత్రం వేళల్లో కాలనీవాసులు సేదతీరడానికి, వాకింగ్ చేయడానికి వీలుగా రూపొందిస్తున్నామన్నారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఓపెన్ జిమ్‌లకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుందని తెలిపారు. సాయంత్రం వేళల్లో పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ఆట పరికరాలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. పద్మా కో- ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులు, ప్రధాన కార్యదర్శి ఎం.రూపేందర్, ప్రతినిధులు మనోహర్, రఘురామ్, గౌరీశంకర్, శైలేష్‌కమీత్కర్, ఎం.రంగయ్య, మోహన్, బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, ముచ్చకుర్తి ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, కొండపల్లి మాధవ్, సురేందర్, అబ్బూ తదితరులున్నారు.

- ఉద్యానవన ఇన్‌చార్జి భాస్కర్‌పై ఎమ్మెల్యే ముఠా గోపాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని పలు పార్కుల్లో అభివృద్ధి పనులను సూచించినప్పటికీ పనుల నిర్వహణలో తీవ్ర జాప్యంపై ఎమ్మెల్యే మండి పడ్డారు. తీరు మార్చుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.


గోల్నాకలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ లావణ్య


అంబర్‌పేట డివిజన్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ విజయ్‌కుమార్

పరిశుభ్రమైన వాతావరణం కల్పనకు కృషి..

నగరాన్ని ఆకుపచ్చని నగరంతో పాటు ప్రజలకు పరిశుభ్రమైన, ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ అన్నారు. స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా సీఎం కేసీఆర్ సూచించిన విధంగా కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో ఎమ్మెల్యేతో కలిసి కమిషనర్ వీఎస్టీ వద్ద మొక్కలు నాటారు. రాష్ట్రంలో కోటి మొక్కలు నాటే లక్ష్యంలో భాగంగా జీహెచ్ఎంసీ పరిధిలో 1.30 లక్షల మొక్కలను నాటాలనే లక్ష్యాన్ని ఇప్పటికే అధిగమించామన్నారు. ప్రజా ప్రతినిధులు ఇందులో భాగస్వాములయ్యారని ఇప్పటికే 1.50 లక్షల మొక్కలను 292 ప్రాంతాల్లో నాటామన్నారు. తెలంగాణ హరితహారం ద్వారానే ఇది సాధ్యమైందన్నారు. యూబీడీ అడిషనల్ కమిషనర్ వి.కృష్ణ, డైరెక్టర్ శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.


పద్మకాలనీలో ఉషోదయ పార్కులో ఎమ్మెల్యే ముఠా గోపాల్


వీఎస్టీ వద్ద ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తో కలిసి మొక్కలు నాటుతున్న జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్

బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజుల స్కీమ్ పునరుద్ధరించాలి


ఇందిరాపార్కులో బీసీ విద్యార్థుల ధర్నాకు మద్దతు తెలుపుతున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ, డిగ్రీ, ఇంటర్మీడియట్ తదితర కాలేజీ కోర్సులు చదివే బీసీ విద్యార్థుల మొత్తం ఫీజుల స్కీమ్‌లను పునరుద్ధరించాలని రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థి మహాధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు ఇస్తున్న మాదిరిగా బీసీ, ఈబీసీ విద్యార్థులకు కూడా పూర్తి ఫీజులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలో 271 గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయన్నారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఆశించిన విద్యా ప్రమాణాలు లక్ష్యాలు నెరవేరడంలేదన్నారు. వాటికి సొంత భవనాలకోసం దశలవారీగా నిధులు విడుదల చేసి సొంత భవనాలు నిర్మించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.5 వేల కోట్ల ఫీజురియంబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీసీబంధును 15 కులాలతో పాటు 130బీసీ కులాలకు వర్తింపచేసి, ఈ నెలలో లబ్ధిదారులకు అందించాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, జిల్లపల్లి అంజి, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలవెంకటేష్, నాయకులు నంద గోపాల్, సుధాకర్, చంద్రశేఖర్‌గౌడ్, శివకృష్ణ, వెంకటరమణయాదవ్ తదితరులున్నారు.

టెన్నిస్ కోర్టు సందర్శన

ముషీరాబాద్: ఇందిరాపార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన టెన్నిస్ కోర్టును జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులతో కలిసి ఎమ్మెల్యే ముఠాగోపాల్ సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మునీర్, క్రీడాకారుడు రమణరావులు మాట్లాడుతూ.. స్టీల్‌బ్రిడ్జ్ నిర్మాణంలో భాగంగా గత కొన్నేళ్లుగా ఇందిరాపార్కు చెన్నారెడ్డి రాక్‌గార్డెన్ సమీపంలో ఉన్న టెన్నిస్ కోర్టును తొలగించి పార్కులోని అవతలివైపు ఏర్పాటు చేస్తామని అధికారులు చెబితే అంగీకరించామన్నారు. చెప్పారు. ప్రస్తుతం స్టీల్‌బ్రిడ్జ్ నిర్మాణ పనులు పూర్తయినందున క్రీడాకారులకు టెన్నిస్ కోర్టును అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఇందిరాపార్కులో నూతంగా దాదాపు కోటిన్నర నిధులతో ఏర్పాటు చేసిన టెన్నిస్ కోర్టులో కనీస సౌకర్యాలు కల్పించి అధికారికంగా ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ అధికారులు సన్నీ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వల్లాల శ్యామ్‌యాదవ్, ఎన్డీ సాయికృష్ణ, నాయకులు వల్లాల శ్రీనివాస్‌యాదవ్, ప్రభాకర్, డాక్టర్ శ్రీహరి, రామిరెడ్డి క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హరితహారంలో భాగంగా శనివారం ఇందిరాపార్కులో ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఉద్యానవన శాఖ అధికారులతో కలిసి మొక్కలు నాటారు.

మత్స్యశాఖ ఉద్యోగులను రెగ్యూలరైజ్ చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

ముషీరాబాద్: మత్స్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యూలరైజ్ చేయాలని రాష్ట్ర ప్రణాళిక సంఘ ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌కు మత్స్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు వినతి పత్రం అందజేశారు. శనివారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాముల రమేష్ మాట్లాడుతూ.. మత్స్యశాఖలో గత ఆరేళ్లుగా పని చేస్తు 193 మంది ఉద్యోగులు వివిధ రకాల సంక్షేమ పథకాలైన ఉచిత చేపపిల్లలు, రొయ్యపిల్లల పంపిణీ, సమీకృత మత్స్య అభివృద్ధి పథకాన్ని 5లక్షల మంది మత్స్యకార సహకార సంఘాల సభ్యులకు, సుమారు 38 లక్షల మత్స్య సహకార కుటుంబాలకు, 4వేల మంది మత్స్య రైతులకు చేరవేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారన్నారు. అర్హతలను పరిగణలోకి తీసుకుని రెగ్యూలరైజ్ చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి ఏసుదాసు, రాష్ట్ర నాయకులు శ్రీకన్య, శ్రీకాంత్, సుస్మిత, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

'ఇనాక్ జీవిత కథ ఓ విజయ గాథ'

చిక్కడపల్లి: 'మా నాన్న' పేరిట ఇనాక్ కుమార్తె మధుజ్యోతి రచించిన 'ఇనాక్ జీవిత కథ.. కష్టాలు కన్నీళ్ల నుంచి ఉన్నతికి చేరిన ప్రతి దళిత వ్యక్తి విజయ గాథ' అని సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ అన్నారు. శనివారం చిక్కడపల్లి త్యాగరాయగానసభ కళాసుబ్బారావు కళావేదికలో ఆచార్య కొలకలూరి మధుజ్యోతి తెలుగులో రచించిన నాన్న వ్యాస సంపుటిని ఆయన ఇనాక్‌తో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. వాస్తవ సంఘటనలను ఆసక్తి కలిగించే కథనంతో మధు జ్యోతి ఇనాక్ జీవితాన్ని చూపారన్నారు. హిందీలో అనువాదం నిర్మల మూల సంపుటిలోని కథనానికి భావుకతకు భంగం కలగకుండా చేశారని అభినందించారు. ఆచార్య ఇనాక్ మాట్లాడుతూ.. తండ్రి జీవిత కథను కుమార్తె నాన్న పేరిట రాయటం వినూత్నమని ఆమె స్వయంగా తన అనుభవాలు కల్పితాలు లేకుండా చెప్పే అవకాశం ఉందన్నారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి, మల్లయ్య భట్టు, కొలకలూరి సుమకిరణ్, తాళ్లపాక చక్రపాణి తదితరులున్నారు.


ఆవిష్కరిస్తున్న గౌరీశంకర్, కొలకలూరి ఇనాక్

మదర్‌థెరిస్సా అవార్డుకు ఎంపిక

చిక్కడపల్లి: ఎస్‌డీఎస్ఎంసీ గ్రూప్ కంపెనీ బండారి దయానంద్‌కు ఈ నెల 29న మదర్‌థెరిసా అవార్డును ప్రదానం చేస్తామని నిర్వాహకులు డాక్టర్ రాజ్‌నారాయణ్ ప్రకటించారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, తదితరులు పాల్గొని అవార్డును బహూకరిస్తారన్నారు.

'గృహలక్ష్మి'ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ముషీరాబాద్: గృహలక్ష్మి పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ప్రజలకు గృహలక్ష్మి పథకంపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. శనివారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 100 గజాలలోపు స్థలం ఉన్న పేదలకు రూ. 3 లక్షలను ఉచితంగా అందజేస్తోందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకునేలా ప్రచారం కల్పించాలన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి సుమారు మూడు వేలమందికి అవకాశం కల్పిస్తున్నామన్నారు.

ఎల్ఓసీ చెక్కుల పంపిణీ..

రాంనగర్‌కు చెందిన ప్రభాకర్‌కు రూ.1.25 లక్షలు, భోలక్‌పూర్‌కు చెందిన వెంకటేషంకు రూ.2.5 లక్షల లోన్ ఆఫ్ క్రెడిట్(ఎల్ఓసీ)లను అందజేశారు.

ఇబ్బంది లేకుండా వ్యాపారాలు చేసుకోవాలి

ముషీరాబాద్: ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా భోలక్‌పూర్‌లోని పార్లస్టిక్, ఐరన్ స్క్రాబ్, తోళ్లమండీల నిర్వాహకులు వ్యాపారం చేసుకోవాలని చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి సూచించారు. శనివారం భోలక్‌పూర్‌లో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఇందిరానగర్, గుల్షన్‌నగర్, అంజుమన్ వీధి, భోలక్‌పూర్ ప్రాంతాల్లో ఏసీపీ యాదగిరి, సీఐ జహంగీర్‌యాదవ్, చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, జీహెచ్ఎంసీ అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లను ఆక్రమించి వ్యాపారం చేస్తున్న వారితో పోలీసులు మాట్లాడారు. రోడ్లపై సామగ్రి వేసి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కల్పించడంతో పాటు శబ్ద, వాయు కాలుష్యాలకు కారకులుగా మారడం తగదన్నారు. నిబంధనలు పాటిస్తూ వ్యాపారం చేసుకోవాలన్నారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. భోలక్‌పూర్ డివిజన్ కార్పొరేటర్ గౌసుద్దీన్, ఎంఐఎం పార్టీ నాయకుడు షరీఫ్ తదితరులు పోలీసులకు అడ్డు తగిలి కొంత గడువు ఇస్తే వ్యాపారులు క్రమశిక్షణ పాటించేలా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అప్పటి వరకు వారికి ఎలాంటి ఇబ్బంది కలిగించవద్దని విజ్ఞప్తి చేశారు.

12వ రోజుకు చేరిన ఏఎన్‌ఎంల ధర్నా


ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తున్న ఏఎన్‌ఎంలు

ముషీరాబాద్: కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను రెగ్యూలరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) అనుబంధం ఆధ్వర్యంలో 12వ రోజు సమ్మె కొనసాగించారు. ముఖ్య అతిథిగా హాజరైన యూనియన్ నగర అధ్యక్షుడు కుమారస్వామి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రెండు సార్లు యూనియన్‌లతో చర్చలు జరిపినప్పటికీ ప్రభుత్వం మొండి వైఖరి వీడటంలేదన్నారు. కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంను రెగ్యూలరైజ్ చేయాలని, లేని పక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి కిరణ్మయి. నగర నాయకులు రాజేశ్వరి, లక్ష్మి, అమ్మాజి, విజయ, ప్రణయశీల తదితరులున్నారు.

18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలి


జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్, డిప్యూటీ కమిషనర్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య

కాచిగూడ: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ అన్నారు. శనివారం కాచిగూడ డివిజన్ పరిధిలోని పోలింగ్ బూత్ కేంద్రాలను కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్ అధికారులు, సిబ్బంది, బీజేపీ నేతలతో కలిసి సందర్శించారు. బీఎల్ఓల వద్ద ఉన్న ఓటరు జాబితాలో తమ పేర్లను పరిశీలించుకోవాలని ప్రజలకు ఆమె విజ్ఞప్తి చేశారు. ఓటరు లిస్టులో పేర్లు లేని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలన్నారు. జీహెచ్ఎంసీ ఏసీపీ వీరస్వామి, నాగరాజు, ప్రేమ్‌రాజ్, బీజేపీ నేతలు సుభాష్ పటేల్, బీమ్‌రాజ్, సూరి, ఎస్.రవియాదవ్ తదితరులున్నారు.

ఓటరు నమోదు కేంద్రం తనిఖీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ కేంద్రాలను జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ కళాశాల ప్రాంగణంలోని పోలింగ్ స్టేషన్లు 201, 202, 203, 204 తదితర కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 01 అక్టోబర్ వరకు 18 ఏళ్లు నిండిన బాలబాలికలు తప్పనిసరిగా ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలని కోరారు. ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్, ఓటరు నమోదు అధికారి డాక్టర్ తిప్పర్తి యాదయ్య, ప్రవీణ్‌చంద్ర పాల్గొన్నారు.

అవినీతిని ఊడ్చేస్తాం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఆమ్‌ఆద్మీ పార్టీ అధికారంలోకి రాగానే అవినీతిని ఊడ్చి పాడేస్తామని ఆమ్‌ఆద్మీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆమ్‌ఆద్మీ పార్టీ సికింద్రాబాద్ లోక్‌సభ కార్యకర్తల సమావేశం జరిగింది. డాక్టర్ హరిచరణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాములుగౌడ్, మహ్మద్ మజీద్, డాక్టర్ సాల్మాన్‌రాజు, డాక్టర్ పుట్టా పాండురంగా, వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జి టి.రాకేష్‌సింగ్, షహద్‌ఖాన్, విజయ్ మల్లంగి, అధికార ప్రతినిధి ఎం.ప్రవీణ్‌కుమార్, మహ్మద్‌అలీ, తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు రుద్రాక్ష మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ.. విద్య, వైద్యం పేదలకు ఉచితంగా అందాల్సిన అవసరం ఉందన్నారు. తమ పార్టీ అధికారంలో ఉన్న ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో విద్య, వైద్యానికి అత్యధిక నిధులు కేటాయించామని ఇది రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వెంటనే విద్య, వైద్యం ఉచితంగా అందిస్తామన్నారు.

మదర్‌థెరిస్సా సేవలు మరువలేనివి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: నోబెల్ శాంతి అవార్డు గ్రహీత మదర్ థెరిస్సా అందించిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శనివారం ముషీరాబాద్ చౌరస్తాలో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనిస్‌రావు ఆధ్వర్యంలో మదర్‌థెరిస్సా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనాథాశ్రమాలు, కుష్టువ్యాధి గ్రస్తులకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి సేవలు అందించారన్నారు. ఆమె చేసిన సేవలను నోబెల్ శాంతి అవార్డు, భారతరత్న అవార్డులు దక్కాయన్నారు. బీఆర్ఎస్ యువజన విభాగం నగర నాయకుడు ముఠా జైసింహ, బీఆర్ఎస్ మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, డివిజన్ ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, దీన్‌దయాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరంకుశ పాలనను తరిమికొట్టాలి

అంబర్‌పేట: రాష్ట్రంలో బీఆర్ఎస్ నిరంకుశ పాలనను సాగిస్తుందని ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యే రాజీవ్ గూమార్ ఆరోపించారు. శనివారం అంబర్‌పేట నియోజకవర్గంలో బీజేపీ నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆ పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్‌రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. అంబర్‌పేట, గోల్నాక, నల్లకుంట, కాచిగూడ ప్రాంతాల్లో బైక్‌ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అహంకారపూరిత పాలనను సాగిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నాయకులు అజయ్‌కుమార్, శ్యామ్‌రాజ్, భూషణ్‌చారి, రవీందర్‌గౌడ్, సునీల్, ఈశ్వర్ తదితరులున్నారు.

ఓటరు జాబితా సవరణ

అంబర్‌పేట: ఓటరు జాబితాలో పేరు నమోదు, సవరణ కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ అధికారులు విస్తృతంగా చేపట్టారు. శనివారం అంబర్‌పేట నియోజకవర్గంలో జీహెచ్ఎంసీ అధికారులు అన్ని పోలింగ్ బూతుల్లో ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. 38 కొత్త ఓటరు దరఖాస్తులు, రెండు సవరణ దరఖాస్తులు వచ్చాయి. డీఎంసీ మారుతి దివాకర్ పర్యవేక్షించారు.

నీటి సంపులోపడి చిన్నారి మృతి

కాచిగూడ: నీటి సంపులోపడి ఓ చిన్నారి మృతి చెందిన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నింబోలిఅడ్డ ప్రాంతానికి చెందిన మహ్మద్ అబ్దుల్లా కుమార్తె హైరా ఫాతీమా (2) శనివారం ఉదయం తండ్రి నీటివాల్‌ను విప్పాడు. చిన్నారి ఆడుకుంటూ ప్రమాదవశాత్తు సంపులో పడి పోయింది. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ ఎమ్మెల్యే ప్రవాస్ యోజన

ముషీరాబాద్: వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అస్సాం రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎమ్మెల్యే పరమానంద్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం భోలక్‌పూర్‌లోని గంగపుత్ర సంఘం హాల్‌లో బీజేపీ ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా భోలక్‌పూర్ డివిజన్ బీజేపీ కమిటీ సమావేశం మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి సీ.కే.శంకర్‌రావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతితో మునిగిపోయిందని విమర్శించారు. రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ రవిచారి, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు, పాల్గొన్నారు.

అర్హులకు తెల్లరేషన్ కార్డులు మంజూరు చేయాలి

అంబర్‌పేట/సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అర్హులైన పేదలకు కొత్త తెల్ల రేషన్‌కార్డులు ఇవ్వాలని సీపీఎం అంబర్‌పేట నియోజకవర్గ కన్వీనర్ మహేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలంటూ శనివారం పౌర సరఫరాల శాఖ సర్కిల్-6 కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల తెల్లరేషన్‌కార్డులను తొలగించిందని ఆయన మండిపడ్డారు. తెల్లరేషన్‌కార్డులు ఇవ్వడానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. సీపీఎం నాయకులు రాములు, సుబ్బారావు, ఎల్.సోమయ్య, షభాన, అఖిల్, వరలక్ష్మి తదితరులున్నారు.

మద్యం మత్తులో బ్లేడుతో యువతి హల్‌చల్

చిక్కడపల్లి: స్నేహితులతో కలిసి ఓ యువతి పీకల దాకా మద్యం తాగి అశోక్‌నగర్ చౌరస్తాలో బ్లేడ్‌తో హల్‌చల్ సృష్టించిన సంఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి జరిగింది. దోమలగూడ ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి కథనం ప్రకారం..అశోక్‌నగర్ చౌరస్తాలో ఇద్దరు యువకులు, ఇద్దరు మహిళలు మద్యం తాగి వాగ్వివాదానికి దిగారు. ఈ క్రమంలో ఓ యువతి బ్లేడ్‌తో చేతులు కోసుకుంది. ఇది చూసిన స్థానికులు భయభ్రాంతులకు గురై అటుగా వెళ్తున్న ట్రాఫిక్ మహిళా కానిస్టేబుల్‌కు చెప్పారు. ఆమె వెంటనే యువతిని ఇతర పోలీసుల సాయంతో ఆటోలో చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌కు, అక్కడి నుంచి దోమల్‌గూడకు తరలించారు. కాగా దీనిపై సీఐ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ యువతి మద్యం మత్తు దిగినాక వదిలివేయాలని వేడుకుందని, భర్తతో గొడవల కారణంగా తాను మద్యం తాగినట్లు చెప్పడంతో వదిలివేశామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

నల్లకుంట: ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఓ డీసీఎం వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడి కాలు విరిగిన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై శివశంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. ముషీరాబాద్‌కు చెందిన మహ్మద్ ఉల్ రహమాన్(28) శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనం (టీఎస్09ఎఫ్‌వై 6014)పై నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా నుంచి ముషీరాబాద్ వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆసుపత్రి చౌరస్తా నుంచి తిలక్‌నగర్ వైపు వెళ్తున్న డీసీఎం(ఏపీ10 డబ్ల్యూ4991) వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడి కాలు విరిగింది. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.